

జోరువానలోనూ..

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

జిల్లాలో శనివారం రాత్రికి 94.68 శాతం పూర్తి

అమలాపురంలో పింఛన్లు పంపిణీ చేసిన కలెక్టర్

పలు మండలాల్లో మంత్రి సుభాష్, ఎమ్మెల్యేలు అందజేత



రామచంద్రపురం(మ) నెలపర్తిపాడులో పింఛన్ అందిస్తున్న మంత్రి సుభాష్

అమలాపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూ లేనివిధంగా ఒకరోజు ముందుగానే పెన్షన్లు పంపిణీ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుంది. ఆదివారం సెలవు రోజు కావడం, ఉద్యోగుల బదిలీలు తదితర కారణాలతో శనివారం సచివాలయ ఉద్యోగులు, ఇతర సిబ్బందితో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశాలతో చేపట్టారు. తెల్లవారుజాము నుంచి కుండపోతగా వర్షం కురుస్తున్నప్పటికీ లెక్క చేయకుండా ఉద్యోగులు, సిబ్బంది ఉదయం 5 గంటల నుంచే పెన్షన్ల పంపిణీ ప్రారంభించారు. కలెక్టర్ మహేష్‌కుమార్ అమలాపురం పట్టణంలోని 2వ వార్డులో పెన్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ ఎస్.మనోహర్, కౌన్సిలర్ ఆశెట్టి నాగదుర్గ-ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రామచంద్రపురం మండలం నెలపర్తిపాడు గ్రామంలో పెన్షన్లను పంపిణీ చేశారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వాడపాలెం, పలివెల, కొత్తపేట గ్రామాల్లోను, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఉప్పలగుప్తం, అల్లవరం, అమలాపురం రూరల్, పట్టణంలో పెన్షన్లను పంపిణీ చేశారు. ఎంపీ గంటి హరీష్‌మాధుర్, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సఖినేటిపల్లిలంకలోను పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ నియోజకవర్గంలోను, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పలు గ్రామాల్లో పెన్షన్లు పంపిణీ చేశారు.

జిల్లాలో 94.68 శాతం పంపిణీ పూర్తి



అమలాపురంలో పింఛన్ అందిస్తున్న కలెక్టర్

జోరు వానలోను సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది శనివారం సాయంత్రం 6 గంటలకు 94.68 శాతం పెన్షన్ల పంపిణీని పూర్తి చేసినట్టు డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్ తెలిపారు. అత్యధికంగా రాజోలు మండలంలో 96.47 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి అయింది. జిల్లాలో 2,41,354 మంది పెన్షన్ లబ్ధిదారులకుగాను 2,28,080 మందికి పెన్షన్లను పంపిణీ చేశారు.లబ్ధిదారులకు రూ.100,51,27,500 పంపిణీ చేయాల్సి ఉండగా రూ.95,02,74,500 పంపిణీ చేసినట్టు ఆయన తెలిపారు. పెన్షన్ల పంపిణీ రాత్రి కూడా కొనసాగుతుందన్నారు.

ఆదివారం ప్రత్యేకం

ఆహా..

అన్నవరం ప్రసాదం



కాకినాడ (ఆంధ్రజ్యోతి)/అన్నవరం: అమృతం అంటే ఎలా ఉంటుందని ఎవరినైనా అడిగితే అన్నవరం ప్రసాదంలా ఉంటుందంటారు చాలామంది.. అడ్డాకులో వేడివేడిగా ఉండే ప్రసాదాన్ని ఒక్కసారి రుచి చూశారా వదిలిపెట్టరు.. ఎవరు పెడతానన్నా కాదనరు... నోట్లో ఇలా వేసుకుంటే అలా కరిగిపోతుంది. మధ్యప్రదేశ్ నుంచి వచ్చే మల్వరాజ్ గోధుమల ద్వారా తయారు చేసే ఈ ప్రసాదానికి మరేదీ సాటిరాదంటే అతిశయోక్తికాదు. ప్రసాదం తయారీలో రుచి, శుచికి ఎంతో ప్రాధాన్యం ఇస్తారు. అందుకే తాజాగా భారత ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఏఐ) గుర్తింపు లభించింది. ఇప్పటికే దీనికి 2019లో ఐఎస్‌వో 22000: 2005 గుర్తింపూ లభించింది. ఏటా రెండు కోట్లకుపైగా ప్యాకెట్లు అమ్ముడవడమే అన్నవరం ప్రసాదం రుచికి నిదర్శనం.

ప్రసాదం చరిత్రకు 133 ఏళ్లు..

అన్నవరం సత్యదేవుడి ఆలయం 1891లో ప్రతిష్ఠితమైంది. అప్పటి నుంచి భక్తులకు గోధుమ రవ్వ ప్రసాదాన్నే అందిస్తున్నారు. అన్నవరం ప్రసాదం అంటే భక్తులకు ఎంత ప్రీతిపాత్రమో చెప్పనక్కర్లేదు. ఉభయ గోదావరి జిల్లాల వాసులు రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు ఎవరిని కలవడానికి వెళ్లినా సత్యదేవుడి ప్రసాదం తీసుకెళ్లి అందించడం సర్వసాధారణం. ప్రసాదంతో వెళితే తలచిన పని త్వరితగతిన పూర్తవుతుందనేది వారి నమ్మకం. ఎందుకంటే అన్నవరం సత్యదేవుడి ప్రసాదానికి నాణ్యత, రుచి, శుచిలో తిరుగులేదు.. భారత ఆహార ప్రమాణాల సంస్థ తాజాగా ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు నిచ్చింది. ఏటా రెండుకోట్లకుపైగా స్వామివారి ప్రసాదం ప్యాకెట్లను దేవస్థానం విక్రయిస్తోంది. ఒక్క ప్రసాదాల ద్వారా ఏటా రూ.40 కోట్ల ఆదాయం సమకూరుతోంది.

మధ్యప్రదేశ్ నుంచి మల్వరాజ్ గోధుమలు..

అన్నవరం ప్రసాదానికి అసలు అంత రుచి ఎక్కడి నుంచి వస్తోంది, అసలు ప్రసాదం ఎలా తయారు చేస్తారనే సందేహాలు చాలామందికి ఉన్నాయి. కోట్లాది మంది భక్తుల మనసుదోచే అన్నవరం ప్రసాదం తయారీలో దేవస్థానం చాలా జాగ్రత్తలు తీసుకుంటుంది. స్థానికంగా దొరికే దినుసులతో ప్రసాదం చేయదు. అత్యంత నాణ్యమైన వస్తువులను రప్పించి మరీ తయారుచేస్తోంది. ప్రసాదం తయారీలో అత్యంత కీలకమైన గోధుమలను ఏకంగా మధ్యప్రదేశ్ నుంచి మల్వరాజ్ రకం దిగుమతి చేసుకుంటోంది. రత్నగిరి కొండపై గోధుమ నూకగా మర ఆడించడానికి ప్రత్యేక యంత్రాలు వినియోగిస్తారు.



ప్రసాదం తయారుచేసే వంట గది



విస్తరాకులే ఎందుకంటే..

సత్యదేవుడి ప్రసాదం ఇప్పటికీ విస్తరాకుల్లోనే భక్తులకు అందిస్తుంటారు. ప్రస్తుతం సాంకేతికంగా అన్నిరంగాల్లో మార్పులు వచ్చినా సత్యదేవుడి ప్రసాదం మాత్రం ఇతరత్రా ప్యాకింగ్‌ల్లో కాకుండా కేవలం విస్తరాకుల్లో వేసి విక్రయించాలని దేవస్థానం అధికారులు నిర్ణయించారు. ప్యాకింగ్ సమయంలో అత్యంత వేడి కలిగిన ఈ ప్రసాదం విస్తరాకుల్లో వేయగానే ఆవిరి, సుగంధ ద్రవ్యాలతో ఆకు మధురంగా మారుతుంది. అందుకే చాలామంది భక్తులు అన్నవరం స్వామి ప్రసాదాన్ని ఆకుతో నాకేయాలంటూ ఛలోక్తులు విసురుతుంటారు. ఈ విస్తరాకులను ఏజెన్సీ ప్రాంతం నుంచి తీసుకొస్తారు. విస్తరాకుల డిమాండు మేరకు అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలోనే కాకినాడ జిల్లా శంఖవరం మండలం గొంది గ్రామంలో 40 ఎకరాల్లో విస్తరాకు తోటలు పెంచాలని అధికారులు భావిస్తున్నారు.



ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్ అందుకుంటున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ (ఫైల్)

అన్నవరం ప్రసాదం తయారీ ఇలా..

ప్రసాదం తయారీకి 3:2:1 నిష్పత్తిలో దినుసులు వేస్తుంటారు. 45 లీటర్ల నీటిని ఎక్కువగా మరిగించి ముందుగా 15 కిలోల మర ఆడించిన గోధుమలను అందులో వేస్తారు. అరగంట ఉడికిన తర్వాత 30 కిలోల పంచదారను కళాయిలో పోసి ఉడికిస్తారు. ఆ తర్వాత స్వచ్ఛమైన ఆవునెయ్యిని మిశ్రమం చేసి ఉడికిన తర్వాత యాలకుల పొడి మిశ్రమాన్ని కళాయిలో వేస్తారు. గంటసేపు వంటస్వాములు బాకుతో తిప్పగా ప్రసాదం పూర్తిగా గోధుమరంగులోకి వస్తుంది. అప్పుడు ట్రాలీ తొట్టెల్లో కళాయిల నుంచి డంపు చేస్తారు. ట్రాలీ తొట్టెలో వేసిన తర్వాత మరోసారి యాలికల పొడి మిశ్రమాన్ని వేసి మూడు గంటలపాటు ఉంచుతారు. ఆ తరువాత ప్యాకింగ్ విభాగానికి తీసుకెళతారు.



అడ్డాకుల్లో ప్రసాదం



యాలికుల పొడి చల్లి పక్కన ఉంచిన ప్రసాదం

- అమృతం.. అన్నవరం ప్రసాదం
- 150 గ్రాములు రూ.20లు
- ఏటా 2 కోట్ల ప్యాకెట్లు విక్రయాలు
- ఆలయానికి రూ.40 కోట్ల ఆదాయం
- రుచి.. శుచిలో అద్భుతం
- గోధుమ రవ్వతో అదరహో
- బయటచేసినా రాని ప్రసాద రుచి
- రత్నగిరిపై 133 ఏళ్లుగా అదే ప్రసాదం
- తాజాగా ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు

ఏటా రూ.2కోట్లకుపైనే అమ్మకాలు..

సత్యదేవుడి ప్రసాదాన్ని లొట్టలేసుకుని తినని భక్తులుండరు. 150 గ్రాముల ప్యాకెట్లను రూ.20కి విక్రయిస్తారు. రోజంతా విక్రయాలు అందుబాటులో ఉంటాయి. ప్రసాదం ప్యాకెట్లు ఏటా రూ.2కోట్లకుపైగా విక్రయమవుతాయి. ఒక్కొక్క ప్రసాదం ప్యాకెట్టు 150 గ్రాముల ఉండేలా తూనిక లేకుండా హస్తంగరిటతో విస్తరాకుల్లో వేసి 58 మంది ప్యాకింగ్ చేస్తారు. వీటిని బుట్టల్లో 100 ప్యాకెట్ల చొప్పున వేసి మరో 10 మంది కావిడ మోతదారులు ప్రసాదం విక్రయ కేంద్రాలకు తీసుకెళ్తారు. ప్రసాదం భక్తులకు 24 గంటలు అందుబాటులో ఉంచుతారు. ప్రసాదం ప్యాకింగ్ చేసే సమయంలో ప్యాకర్లు తలపై టోపీ చేతులకు గ్లౌజ్ తొడిగి ఎంతో శుచిగా తయారుచేస్తుంటారు. అన్నవరం ప్రసాదం తయారీకి 10 మంది వంటస్వాములు విడతలవారీగా విధులు నిర్వహిస్తారు. వీరంతా కొండపై తయారుచేసిన ప్రసాదాన్ని తిరిగి ఇంటికి వెళ్లి చేసినా రుచి, నాణ్యత రాదంటారు. కేవలం కొండపైనే ప్రసాదం తయారీ విభాగంలో చేస్తేనే సత్యదేవుడి మహిమతో ఇంతటి రుచి వస్తుందని పేర్కొనడం విశేషం.

స్తంభించిన జనజీవనం



అమలాపురంలో నీట మునిగిన రోడ్డు

జిల్లా వ్యాప్తంగా వర్షాలు

విద్యాసంస్థలకు సెలవు ప్రకటించిన కలెక్టర్

రాగల మూడు రోజులూ భారీ వర్షాలే

అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

అమలాపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో జిల్లాలో ప్రజాజీవనం స్తంభించిపోయింది. సముద్ర తీరంలో అలల తీవ్రత పెరిగి తీరాన్ని తాకుతుండడంతో తీరం కోతకు గురవుతోంది. ముందు జాగ్రత్త చర్యగా కలెక్టర్ మహేష్‌కుమార్ జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలకు శనివారం సెలవు ప్రకటించారు. కొన్నిచోట్ల వర్షపు నీరు నిల్వ ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. అమలాపురం పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి ఈదరపల్లి వెళ్లే రహదారి వర్షపు నీటిలో చిక్కుకోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రానున్న మూడు రోజుల పాటు ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లాలోని ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ మహేష్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. శనివారం కలెక్టరేట్ నుంచి అధికారులతో టెలీ కాన్ఫరెన్సు నిర్వహించి వర్షాల ప్రభావంపై దిశానిర్దేశం చేశారు. టౌన్ ప్లానింగ్ అధికారులు సమన్వయం చేసుకుని ఎక్కడా వర్షపునీరు నిల్వ లేకుండా చూడడంతో పాటు పురాతన ప్రభుత్వ ప్రైవేటు భవనాలను గుర్తించి అక్కడ నివాసితులను అలర్ట్ చేయాలని ఆదేశించారు. విద్యుత్ స్తంభాలు, చెట్లు బలహీనంగా ఉన్న వాటిని గుర్తించి సిబ్బందికి తెలియచేయాలని అలాగే కాజ్‌వేలు, కల్వర్టులు, వంతెనల వద్ద రెడ్ ఫ్లాగ్‌లు ఏర్పాటుచేసి వాటిపై ప్రజలు ప్రయాణించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎక్కడికక్కడే పంట పొలాల్లో నీరు దిగేలా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకుని ముంపు బెడదను నివారించాలని సూచించారు. పురాతన భవనాలు, పూరిపాకల్లో ఉండేవారిని గుర్తించి సురక్షిత కేంద్రాలకు తరలించి పునరావాస చర్యలు చేపట్టాలని, మత్స్యకారులెవరూ చేపలవేటకు మూడు రోజులు పాటు వెళ్లవద్దని విజ్ఞప్తి చేశారు. అత్యవసర మందులు పీహెచ్‌సీల్లో సిద్ధం చేసుకోవాలని సూచించారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ తెలిపారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు..

విద్యుత్‌శాఖ డివిజనల్ కార్యాలయాల్లో కంట్రోల్ రూములను ఏర్పాటు చేసినట్టు రాజమహేంద్రవరం ఆపరేషన్ సర్కిల్ ఏపీఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజనీర్ కె.తిలక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అమలాపురం డివిజన్‌లో కంట్రోల్ రూము సెల్ 9440904477, రామచంద్రపురం డివిజన్ కంట్రోల్ రూము సెల్ 9493178821, ఫోన్ నంబరు 08857-243082. ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని కోరారు.

జిల్లాలో వర్షపాతం..

జిల్లాలో శనివారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురిసింది. అత్యధికంగా సఖినేటిపల్లి మండలంలో 116 మిల్లీమీటర్లు, అత్యల్పంగా మండపేటలో 33.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో సగటున 66.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆత్రేయపురం 44.2 మిల్లీమీటర్లు, రాయవరం 65.6, రామచంద్రపురం 42.6, ఆలమూరు 42.4, రావులపాలెం 53.2, కొత్తపేట 63.2, కపిలేశ్వరపురం 39.2, కె.గంగవరం 45.2, ఐ.పోలవరం 68.2, ముమ్మిడివరం 58.6, అయినవిల్లి 58.4, పి.గన్నవరం 67.4, అంబాజీపేట 69.2, మామిడికుదురు 84.4, రాజోలు 107.2, మలికిపురం 112.8, అల్లవరం 72.6, అమలాపురం 54.4, ఉప్పలగుప్తం 85.8, కాట్రేనికోన మండలంలో 65.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదమైంది.

జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా గోల్డెన్ అవర్ బీమా

8464 మంది విద్యార్థులకు హెల్త్ ఇన్సూరెన్స్

బ్యాంకర్లతో మాట్లాడిన కలెక్టర్ మహేష్‌కుమార్

పేద విద్యార్థులకు పెద్ద ప్రయోజనం



హాస్టల్ విద్యార్థులకు

ఆరోగ్య రక్ష

అమలాపురం రూరల్, ఆగస్టు 31: నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటూ విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. వారి ఆరోగ్యానికి రక్షణగా నిలిచేందుకు, ఏదైనా ప్రమాదాలు జరిగినప్పుడు వారికి ధీమాగా ఉండేలా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ చొరవ చూపారు. జిల్లాలోని గురుకుల పాఠశాలలతో పాటు సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమశాఖ వసతిగృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులందరికీ ఆరోగ్య బీమా సదుపాయం కల్పించేందుకు నిర్ణయించారు. గోల్డెన్ అవర్ బీమా పథకం పేరుతో జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసేందుకు అవసరమైన విధి విధానాలను రూపొందించాలని ఇప్పటికే బ్యాంకర్లకు సూచించి వివిధ ఆరోగ్య బీమా సంస్థలతో చర్చించారు. త్వరలోనే వసతిగృహ విద్యార్థులకు గోల్డెన్ అవర్ బీమా సదుపాయం అమలులోకి తీసుకువచ్చే విధంగా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.



జిల్లాలో 8464 మందికి వర్తింపు

జిల్లాలోని గురుకుల పాఠశాలలతో పాటు ప్రభుత్వ వసతిగృహాల్లో 7752 మంది విద్యార్థులు విద్యాభ్యాసం సాగిస్తున్నారు. వీరితో పాటు ప్రభుత్వ, ప్రైవేటు ఎన్జీవోలు నిర్వహిస్తున్న అనాథాశ్రమాల్లో 712 మంది పిల్లలను గుర్తించారు. జిల్లాలోని 8464 మంది విద్యార్థులకు ఆరోగ్య బీమా కల్పించడమే గోల్డెన్ అవర్ బీమా పథకం లక్ష్యం.





బీమా వర్తించేది ఇలా..

వసతిగృహ విద్యార్థులు ప్రమాదాల బారిన పడినప్పుడు, ఆరోగ్య పరమైన సమస్యలు ఉత్పన్నమైనప్పుడు గోల్డెన్ అవర్ బీమా వర్తిస్తుంది. వసతి గృహ విద్యార్థులు ఎవరైనా రోడ్డు ప్రమాదాలకు గురైనా, ఎలక్ట్రికల్ షాక్ తగిలినా, పాము కాటుకు గురైనా కూడా ఈ పథకం వర్తించేలా కార్యాచరణ సిద్ధం చేశారు. అదే విధంగా సామూహికంగా ఫుడ్ పాయిజనింగ్ జరిగినా ఆటలాడుకునే సమయంలో గాయాల పాలైనా, అనారోగ్యం బారిన పడినా బీమా సదుపాయం కల్పించేలా కార్యాచరణ రూపొందించారు. ఈ పథకం అమలులో భాగంగా ప్రతీ 40 మంది విద్యార్థులకు ఒక నోడల్ అధికారిని నియమించి అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ప్రైవేటు ఆసుపత్రిలో వైద్య సేవలు అందించనున్నారు.

రూ.లక్ష వరకు వైద్య సేవలు

గోల్డెన్ అవర్ బీమా పథకంలో వసతిగృహ విద్యార్థులకు రూ.50వేలు నుంచి రూ.లక్ష వరకు వైద్య సేవలు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఒక్కో విద్యార్థికి బీమా ప్రీమియం చెల్లించే విషయంలో బ్యాంకర్లు తుది నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అతి తక్కువ ప్రీమియంతో వైద్య సేవలు అందించే ఆరోగ్య బీమా సంస్థలకు ప్రాధాన్యత ఇస్తారు. ఈ పథకం విజయవంతమైతే పారిశుధ్య కార్మికులతో పాటు వివిధ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు కూడా వర్తింప చేయనున్నారు.

శనేశ్వరాలయానికి

పోటెత్తిన భక్తులు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొత్తపేట, ఆగస్టు 31: మందపల్లి మందేశ్వర (శనేశ్వర) స్వామి వారి త్రయోదశిని పురస్కరించుకుని శనివారం రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. స్వామివారి ప్రాతఃకాల అర్చన అనంతరం సర్వదర్శనాలు చేసుకున్నారు. తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మర్యాదలతో స్వామివారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించగా పోలీసులు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా బందోబస్తు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.27,18,070 ఆదాయంగా లభించినట్టు ఆలయ సహాయ కమిషనర్, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు.



ఈవీఎం గోదామును తనిఖీ చేస్తున్న కలెక్టర్

ఈవీఎం గోదాము తనిఖీ

ముమ్మిడివరం, ఆగస్టు 31: ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈవీఎంలు భద్రపరిచిన గోదామును జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ శనివారం తనిఖీ చేశారు. ఈవీఎంలు భద్రపరిచిన గోదాముకు వేసిన సీలును ఆయన పరిశీలించారు. సంబంధిత రిజిస్టర్‌లో సంతకాలు చేశారు. ఏపీఈడబ్ల్యూఐడీసీ డీఈ సుబ్బరాజు, పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



నేనూ గోదారోడినే..

సినిమా రంగంలో రాణిస్తున్న కసిరెడ్డి రాజకుమార్

ఆయ్ సినిమాతో ప్రేక్షకులతో గిలిగింతలు

5

డొంకరాయి జలాశయం నుంచి..

రెండు గేట్ల ద్వారా 4400 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల

సీలేరు కాంప్లెక్సు పరిధిలోని డొంకరాయి జలాశయం నుంచి రెండు గేట్లు ద్వారా 4,400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. గత రెండ్రోజులుగా డొంకరాయి జలాశయం ఎగువ ప్రాంతంలో భారీగా వర్షాలు కురుస్తుండడంతో వలసగెడ్డ, మంగంపాడు, వాగుల నుంచి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. దీంతో జెన్‌కో అధికారులు అప్రమత్తమై జలాశయం నీటిమట్టం ప్రమాద స్థాయి చేరుకోకుండా చర్యలు చేపట్టారు. డొంకరాయి జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 1037 అడుగులు కాగా, 1036 అడుగుల వద్ద నీటిమట్టం క్రమంగా కొనసాగేలా జెన్‌కో అధికారులు చర్యలు చేపడుతున్నారు. జలాశయంలోకి 8 వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లోస్ వస్తుండడంతో 4 వేల క్యూసెక్కులు కెనాల్ ద్వారా పొల్లూరు జలవిద్యుత్ కేంద్రానికి విడుదల చేస్తుండగా, 4400 క్యూసెక్కుల నీటిని జలాశయం రెండు గేట్ల ద్వారా ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. - మోతుగూడెం



వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం



స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.21.94 లక్షలు

ఆత్రేయపురం, ఆగస్టు 31: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే స్వామి వారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరు వీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. జోరువానలో భక్తులు తడుచుకుంటూ స్వామివారి వ్రతం ఆచరించారు. కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ సతీమణి వెంకటేశ్వరిదేవి సామాన్య భక్తురాలిగా స్వామిని దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.21.94 లక్షలు లభించినట్టు ఉప కమిషనర్, ఈవో భూపతిరాజు కిశోర్ కుమార్ తెలియజేశారు.



ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి.. ఆలయంలో కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ సతీమణి వెంకటేశ్వరిదేవి పూజలు



ద్రాక్షారామ భీమేశ్వర స్వామి దేవస్థానం ఈవోగా అల్లు దుర్గా భవాని

ద్రాక్షారామ, ఆగస్టు 31: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామ భీమేశ్వరస్వామి దేవస్థానం సహాయ కమిషనర్, కార్య నిర్వాహణాధికారిగా అల్లు వెంకట దుర్గాభవాని నియమితులయ్యారు. ఆమె శనివారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆలయ సిబ్బంది పలువురు ఆమెకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు.



ఆయ్ సినిమా షూటింగ్‌లో రాజ్‌కుమార్



ఆయ్..

నేను గోదారోన్నేనండి!

- సినిమా రంగంలో రాణిస్తున్న కసిరెడ్డి రాజకుమార్
- ఇటీవల ఆయ్ సినిమాతో ప్రేక్షకులతో గిలిగింతలు

గోదావరి జిల్లాల నుంచి ఎందరో సినిమా రంగంలో అడుగుపెట్టి ఎంతోపేరు ప్రఖ్యాతలు సాధించారు. అలా ఇప్పుడు హాస్యనటుడిగా చిత్రపరిశ్రమలో మంచిపేరు సాధించారు కసిరెడ్డి రాజకుమార్. ఇటీవల వచ్చిన ఆయ్ సినిమాలో గోదావరి యాసలో డైలాగ్స్ అదరగొట్టి ప్రేక్షకులతో నవ్వులు పూయించారు ఈ యువనటుడు. తన తల్లి, తాత వెన్ను తట్టి ప్రోత్సహించి తనలో ఉన్న ఆసక్తిని గమనించి పూర్తి సహకారాన్ని అందించడంతో సినీ రంగంలో మంచి స్థాయికి చేరుకున్నానని చెబుతున్నాడు రాజకుమార్. కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం జె.అన్నవరం గ్రామానికి చెందిన కసిరెడ్డి సీతారామయ్య, గంగా భవాని ఏకైక కుమారుడు రాజ్‌కుమార్. తండ్రి మరణించడంతో రాజ్‌కుమార్ తన తల్లితోపాటు అమ్మమ్మగారి ఊరు అయిన భద్రవరం చేరుకున్నాడు. తాత మాణిక్యం వ్యవసాయ పనులు చేసుకుంటూ భజన పాటలు ఆలపించేవారు. అక్కడే భజన బృందాలు వాయించే హార్మోనియం, వాయిద్యం రాజ్‌కుమార్‌ని ఆకర్షించాయి. ఈ నేపథ్యంలో మ్యూజిక్‌లో డిప్లమా పట్టా పొందాడు. రాజ్‌కుమార్‌లో ఉన్న ఆసక్తిని ముందుగానే గమనించిన తల్లి గంగాభవాని హైదరాబాద్ పంపించి ప్రోత్సహించారు. అలా హైదరాబాద్ వెళ్లిన రాజకుమార్ తన టాలెంట్‌తో సినిమాల్లో రాణించాడు. రాజావారు రాణిగారు, అశోకవనంలో అర్జున కల్యాణం, బెదురులంక 2012, అర్జున ఫాల్గుణతోపాటు పలు సినిమాల్లో కమెడియన్‌గా అలరించాడు రాజ్‌కుమార్. ఇటీవల ఆయ్ సినిమాతో సక్సెస్ సాధించిన ఈ హాస్యనటుడిని ఆంధ్రజ్యోతి పలకరించగా పలు విశేషాలను పంచుకున్నాడు.



ఆయ్ సినిమా విజయం సాధించిన సందర్భంగా రాజ్‌కుమార్‌ను అభినందిస్తున్న జూనియర్ ఎన్టీఆర్



'బ్లడీ మేరీ' చిత్రంలో రాజ్‌కుమార్

ప్రశ్న: సినిమా రంగంలో అవకాశం ఎలా వచ్చింది?
రాజ్‌కుమార్: నాకు చిన్ననాటి నుంచి సినిమాలు అంటే ఇష్టం. రాజా వారు రాణిగారు సినిమా దర్శకుడు కోలా రవికిరణ్ సహకారంతో నాకు తొలి చిత్రంలో నటించే అవకాశం వచ్చింది. అలా మొదటగా రాజా వారు రాణిగారు సినిమాలో నటించాను. ఆ సినిమాలో చౌదరి క్యారెక్టర్ నాకు మంచి పేరు తెచ్చిపెట్టింది.

ప్రశ్న: ఇప్పటి వరకు ఎన్ని సినిమాల్లో నటించారు?
రాజ్‌కుమార్: ఇప్పటివరకు పది సినిమాల్లో నటించారు. అన్ని పాత్రల్లో నాకు నటన సంతోషాన్నిచ్చింది.

ప్రశ్న: మీ జీవితంలో ఎవరి ప్రోత్సాహం అధికంగా ఉంది.?
రాజ్‌కుమార్: మా తాత మాణిక్యం నన్ను పూర్తిగా ప్రోత్సహించారు. అండగా ఉంటూ నేను సంగీతంలో పట్టా తీసుకోవడంలో సహకరించారు. తాత మరణం అనంతరం మా అమ్మ నువ్వు సినీ రంగంలో మంచిస్థానంలో ఉన్నప్పుడే తాత ఆత్మశాంతిస్తుందని చెబుతూ ఉండేది. ఆమె మాటలే నా జీవితాన్ని మలుపుతిప్పాయి.

ప్రశ్న: మీకు సంతృప్తినిచ్చిన పాత్రలేమిటి?
రాజ్‌కుమార్: నా తొలిచిత్రం రాజావారు రాణిగారు సినిమాలో చౌదరి పాత్ర మంచిపేరు తెచ్చి పెట్టింది. ఇటీవల విడుదలైన ఆయ్ చిత్రంలో హీరో స్నేహితుడిగా సుబ్బు పాత్ర కూడా నాలో ఉన్న ప్రతిభకు మెరుగులుదిద్దింది.

ప్రశ్న: మీ లక్ష్యం ఏమిటి?
రాజ్‌కుమార్ : తక్కువ చిత్రాల్లో నటించినా నాకంటూ సినీరంగంలో ఒక ప్రత్యేక స్థానం ఉండాలి.

ప్రశ్న: కొత్త సినిమాలు ఏం చేస్తున్నారు?
రాజ్‌కుమార్: హీరో విజయ దేవరకొండ సినిమా ఒకటి, ఇంకా రెండు కొత్త సినిమాల్లో నటిస్తున్నాను.

ప్రశ్న: ఆయ్ సినిమా ఇంత విజయం సాధించడం మీకెలా ఉంది?
రాజ్‌కుమార్ : చాలా సంతోషంగా ఉంది.

- ఏలేశ్వరం

అన్నవరం దేవస్థానంలో ప్రసాద్ స్కీం పనులకు రూ 25.32 కోట్లు

త్వరలో ఆర్థికపరమైన అనుమతులు

అన్నవరం, ఆగస్టు 31: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో అభివృద్ధి పనులకు సంబంధించి గత ఎనిమిదేళ్లగా ఎదురుచూస్తున్న ప్రసాద్ స్కీం నిధుల విషయంలో మరో అడుగు ముందుకుపడింది. ప్రస్తుతం అన్నదాన భవన అవసరం దృష్ట్యా ఈవో రామచంద్రమోహన్ పర్యాటక అధికారులను ప్రసాద్ స్కీం నిధుల విషయం ఎంతవరకు వచ్చిందని శనివారం ఆరాతీశారు. స్కీం నిధులకు అనుమతులు వచ్చాయని, త్వరలో ఆర్థికపరమైన ఉత్తర్వులు వెలువడతాయని, అనంతరం టెండర్లు పిలిచి పనులు మొదలపెట్టవచ్చునని సమాధానమివ్వడంతో మళ్లీ ఆశలు చిగురించాయి. ప్రసాద్ స్కీం పనులను ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించినా ఆర్థికపరమైన అనుమతులు ఆలస్యమవుతూనే ఉన్నాయి. తాజాగా 25.32 కోట్లకు అనుమతులురాగా త్వరలో ఆర్థికపరమైన ఉత్తర్వులు వస్తాయని టూరిజం అధికారులు పేర్కొన్నారని సమాచారం. వీటితో అన్నదాన భవనం, క్యూకాంప్లెక్స్, ఎలక్ట్రికల్ బస్సులు, చార్జింగ్ స్టేషన్‌లు ఏర్పాటుకు అనుమతులు లభించాయి. కాగా మోదీ వర్చువల్ ప్రారంభోత్సవంలో రూ.20.62 కోట్ల పనులని ప్రకటించగా రూ.25.32 కోట్లు అని తెలపడంతో ఆలయ అధికారులు కొంత సందిగ్ధంలో పడ్డారు.

మునిసిపల్ ఆర్డీగా నాగనరసింహరావుకు పూర్తి బాధ్యతలు

కార్పొరేషన్(కాకినాడ)/రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 31: రాజమహేంద్రవరం మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ (ఎఫ్ఏసీ)గా విధులు నిర్వహిస్తున్న కాకినాడ నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ సీహెచ్ నాగనరసింహరావుకు పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. నాగనరసింహరావు కాకినాడ అడిషనల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ మునిసిపల్ ఆర్‌డీగా కూడా అదనపు బాధ్యతలు నిర్వహించారు. ఆయనను రాజమహేంద్రవరం మునిసిపల్ ఆర్‌డీగా పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం బదిలీచేసింది. అంతకుముందు కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా ఐదేళ్లు పనిచేశారు. ఈ ఐదేళ్లలో ఆయన ఎఫ్ఏసీ ఇన్‌చార్జి కమిషనర్‌గా, ఎఫ్ఏసీ కౌడా వైస్ చైర్మన్‌గా, మెప్మా ఇన్‌చార్జి పీడీగా, కొవిడ్ సమయంలో స్పెషల్ ఆఫీసర్‌గా, ఎన్నికల అధికారిగా పలు బాధ్యతలు నిర్వహించారు. నరసింహరావు ఆర్డీగా వెళుతుండడంతో కాకినాడ కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. ఆయన స్థానంలో రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్‌లో సెక్రటరీగా పనిచేస్తున్న కేటీ సుధాకర్ కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ బాధ్యతలు చేపట్టనున్నారు. కౌడా వైస్ చైర్మన్‌గా కార్పొరేషన్ కమిషనర్ భావనకు ఎఫ్ఏసీ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటివరకు వీసీగా పనిచేస్తున్న కృష్ణమూర్తి తన మాతృశాఖ రెవెన్యూకు వెళ్లనున్నారు.

రుడా వీసీ బాలస్వామి రిలీవ్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 31: రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) వీసీగా పనిచేస్తున్న బాలస్వామిని రాష్ట్ర ప్రభుత్వం రిలీవ్ చేసింది. ఆయన్ను ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశించింది. బాలస్వామి గత ప్రభుత్వ హయాం నుంచి రుడా వీసీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత బదిలీల్లో భాగంగా ఆయనను రిలీవ్ చేశారు. ఇన్‌చార్జి వీసీగా అదనపు బాధ్యతలను రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్‌కు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ప్రైవేటుకే ఓకే!

మద్యం షాపులకు 15న నోటిఫికేషన్

వచ్చే నెల 1 నుంచి కొత్త విధానం... ఇక 'జె' బ్రాండ్లకు స్వస్తి

రాజమహేంద్రవరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో ప్రైవేటు షాపుల్లో మద్యం అమ్మకాలు ప్రారంభించనున్నారు. జగన్ పిచ్చి బ్రాండ్లకు, నాసిరకం మద్యానికి పూర్తిగా స్వస్తి చెప్పి కొత్త మద్యం విధానం తీసుకొచ్చే ప్రక్రియను కూటమి ప్రభుత్వం వేగంగా చేస్తోంది. ఈ క్రమంలో నాలుగైదు రోజుల్లో ఎంసీ, సియాగ్రమ్స్ వంటి మల్టీ నేషనల్ కంపెనీలకు చెందిన ఎంసీ బాంధ్రీ, విస్కీ, ఐబీ విస్కీ, నాకౌట్, ఖజురహో బీర్‌లు తదితర బ్రాండ్ల సరుకు మార్కెట్లోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే వీటి సరఫరాకు ఆయా కంపెనీలకు ఇండెంట్లు వెళ్లాయి. ఇక కొత్త మద్యం పాలసీపై నోటిఫికేషన్ ఈ నెల 15న విడుదల అవుతుందని చెబుతున్నారు. 25కి ప్రక్రియ పూర్తి చేసి 30 నాటికి ప్రైవేటుషాపుల్లో అమ్మకాలు ప్రారంభించనున్నారు. అక్టోబరు 1 నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలు, జగన్ పిచ్చి బ్రాండ్లు కనుమరుగు అవుతాయనే చర్చ నడుస్తోంది. ధరలు కూడా దిగిరానున్నాయి. రూ.120కే రెండు మూడు మంచి బ్రాండ్ల మద్యం అందుబాటులోకి రానుందని తెలుస్తోంది. నాణ్యమైన చీప్‌లిక్కర్‌కి రూ.100లోపే ధర నిర్ణయిస్తారని సమాచారం. అయితే ప్రస్తుతం ఉన్న బార్ల యాజమాన్యాలు, ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బందితో కాస్త ఇబ్బంది తలెత్తే అవకాశం ఉంది. ఇప్పటికే ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేస్తున్న ఉద్యోగులు 7న రాష్ట్ర వ్యాప్తంగా షాపులు మూసేసి ధర్నా చేయడానికి పిలుపునిచ్చారు. జగన్ ప్రభుత్వంలో మద్యం ధరలు అమాంతం పెరిగిన విషయం తెలిసిందే. దానికితోడు బార్లలో క్వార్టరుపై సుమారు రూ.80 వరకూ, బీరుపై రూ.100-130 వరకూ అదనంగా వసూలు చేస్తున్నారు. ప్రైవేటు షాపులు, పర్మిట్ రూంలు వస్తే ఈ విధానం కుదరదు. పైగా ప్రైవేటు షాపుల్లో అన్ని బ్రాండ్లూ అందుబాటులో ఉంటాయి. దీంతో ప్రస్తుతం కొనసాగుతున్న బార్లకు మందుబాబులు వెళ్లే పరిస్థితి ఉండదు. వీటికి లైసెన్సులు జారీ చేసి ఇప్పటికే ఏడాది గడిచింది. రెండో ఏడాది మొదలు కావడంతో లైసెన్సు ఫీజు చెల్లించాల్సి ఉంది. అయితే నిడదవోలులోని రెండు బార్లు ఫీజు చెల్లించలేదు. ఏదిఏమైనా మందుబాబులకు ఇచ్చిన మాట నెరవేర్చేలా బ్రాండ్ మద్యాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చేపనిలో ఉంది.







కమిషనరుపై దాడిచేస్తున్న డీఈఈ... డీఈఈపై దాడికి దిగిన కమిషనర్.. మునిసిపల్ ఆర్డీకి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు

వీధిన పడ్డ అధికారుల పోరు

పిఠాపురం మునిసిపల్ సమావేశంలో కమిషనరు, డీఈఈ బాహాబాహీ.. వారి బూతులకు తలదించుకున్న మహిళా కౌన్సిలర్లు, సిబ్బంది

పిఠాపురం, ఆగస్టు 31: పిఠాపురం పురపాలక సంఘంలో కొంతకాలంగా అధికారుల మధ్య సాగుతున్న అంతర్గతపోరు వీధినపడింది. కౌన్సిల్ సమావేశంలోనే కమిషనరు, డీఈఈలు తోపులాట, బాహాబాహీకి దిగారు. సమావేశంలో మహిళలు ఉన్నారని, తాము ఉన్నతాధికారులమని మరిచిపోయి ఇద్దరూ బూతులు తిట్టుకున్నారు. పిఠాపురం పురపాలకసంఘ కార్యాలయంలో శనివారం మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి హాజరుకాకపోవడంతో వైస్‌చైర్మన్-1 పచ్చిమళ్ల జ్యోతి సమావేశానికి అధ్యక్షత వహించారు. సమావేశంలో అజెండాలోని అంశాలు చదువుతుండగా కౌన్సిలరు బోను దేవ మునిసిపాలిటీలో నూతనంగా నియమితులైన అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి జీతాలు చెల్లింపు అంశాన్ని ప్రస్తావించారు. కౌన్సిల్‌కు సమాచారం లేకుండా ఆరునెలలు కిందట ఏడుగురుని అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించారని, వీరిని నియామకాన్ని రద్దుచేయాలని కౌన్సిల్ తీర్మానం చేసిందని ఆయన గుర్తుచేశారు. కౌన్సిల్ వ్యతిరేకించినా ఏడుగురికి ఏవిధంగా జీతాలు చెల్లించారని, ఇంజనీరింగ్ విభాగంలో ఏ అధికారీ లేరని చెబుతున్నారని, అటువంటప్పుడు బిల్లు ఏ విధంగా చేశారని దేవతోపాటు పలువురు కౌన్సిలర్లు ప్రశ్నించారు. దీనిపై మునిసిపల్ కమిషనరు కనకారావు సమాధానమిస్తూ హైకోర్టు ఆదేశాల మేరకు జీతాలు చెల్లించామన్నారు. బిల్లుల చెల్లింపు విషయంలో కొంతకాలంగా ప్రస్తుత మునిసిపల్ డీఈఈ భవానీశంకర్ తనకు సహకరించడం లేదని, దీంతో తాను ఉన్నతాధికారులకు పరిస్థితిని వివరించగా, ఆ బాధ్యతలను పబ్లిక్‌హెల్త్ ఈఈ హస్నేన్‌కు అప్పగించారని వివరించారు. ఈ సమయంలో డీఈఈపై కమిషనరు కొన్ని ఆరోపణలు చేశారు. డీఈఈ వల్ల ఏ పని జరగడం లేదని చెప్పుకొచ్చారు. పనుల నిర్వహణలో పలు అవకతవకలు జరిగాయని ఆరోపించారు. దీంతో డీఈఈ భవానీశంకర్ ప్రత్యారోపణలు చేశారు. కమిషనరు వల్లే అధికారులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని, 15మంది ఉద్యోగులు బదిలీకి దరఖాస్తు చేసుకున్నారని డీఈఈ తెలిపారు. తనను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తే కోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చుకున్నానని తెలిపారు. ఈ సమయంలో కమిషనరు, డీఈఈలు ఆరోపణలు చేసుకున్నారు. ఇది వాగ్వివాదం, తోపులాటకు దారితీసింది. ఇరువురు ఒకరిని ఒకరు కొట్టుకున్నారు. బూతులు తిట్టుకున్నారు. దీనితో ఒక్కసారిగా కౌన్సిల్ అంతా విస్మయానికి లోనైంది. కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది వచ్చి కొట్లాటకు దిగిన కమిషనరు, డీఈఈలను విడదీశారు. వీరు బూతులు తిట్టుకోవడంతో మహిళా కౌన్సిలర్లు, సిబ్బంది ఇబ్బంది పడ్డారు. మునిసిపల్ కమిషనరుగా కనకారావు ఫిబ్రవరిలో ఇక్కడకు బదిలీపై వచ్చారు. అప్పటినుంచి కమిషనరు, డీఈఈల మధ్య విభేదాలు ఉన్నాయి. ఎన్నికల సమయంలో డీఈఈగా ఉన్న భవానీశంకర్ సెలవు పెట్టడం, అదే సమయంలో డీఈఈపై కౌన్సిలర్ల ఫిర్యాదు నేపథ్యంలో అతన్ని పబ్లిక్ ఇంజనీర్ ఇన్ చీఫ్‌కు సరెండర్ చేస్తూ కమిషనరు కనకారావు ఉత్తర్వులు జారీ చేశారు. అదే సమయంలో డీఈఈ హైకోర్టును ఆశ్రయించి తిరిగి విధుల్లోకి చేరగా, డీఈఈ చాంబర్‌కు కమిషనరు తాళాలు వేయించడం వివాదస్పదంగా మారింది. అప్పటినుంచి ఇద్దరి మధ్య పలుమార్లు గొడవలు జరిగాయి. డీఈఈ తనకు సహకరించడం లేదని, పనులు చేయడం లేదంటూ ఉన్నతాధికారులకు కమిషనరు ఫిర్యాదు చేయడంతో పబ్లిక్‌హెల్త్ ఈఈని ఇన్‌చార్జిగా నియమించారు. దీంతో ఇద్దరి మధ్య వివాదం మరింత ముదిరింది.

ఉన్నతాధికారుల విచారణ.. డీఈఈ సస్పెన్షన్

మునిసిపల్ సమావేశంలో కమిషనరు, డీఈఈ కొట్టుకున్న వ్యవహారంపై పురపరిపాలనాశాఖ ప్రాంతీయ డైరెక్టరు నాగనరసింహరావు, కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్‌లు విచారణ చేపట్టారు. కమిషనరు, డీఈఈతోపాటు మునిసిపల్ అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్లు నుంచి స్టేట్‌మెంట్లు తీసుకున్నారు. కమిషనరు, డీఈఈలను వారు మందలించారు. కమిషనరు, డీఈఈల వ్యవహారశైలి గురించి ప్రత్యేకంగా విచారించారు. మునిసిపాలిటీలో జరుగుతున్న వ్యవహారాలు, నిబంధనలకు విరుద్ధంగా పోస్టుల భర్తీపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు వినతిపత్రం అందజేశారు. విచారణ నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని మునిసపల్ ఆర్డీ, కాకినాడ ఆర్డీవోలు తెలిపారు. కాగా పిఠాపురం మునిసిపల్ డీఈఈ ఎస్.భవానీశంకర్‌ను సస్పెండ్ చేస్తూ పబ్లిక్‌హెల్త్ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఆర్.గోపాలకృష్ణారెడ్డి శనివారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. మరోవైపు ఈ వ్యవహారంపై మునిసిపల్ ఆర్డీ నాగనరసింహరావు, ఆర్డీవో ఇట్ల కిషోర్‌లు విచారణ జరిపి కలెక్టరుకు నివేదిక ఇచ్చారు. కమిషనరుతో వాగ్వివాదానికి దిగి, మ్యాన్‌హేండ్లింగ్ చేయడంతోపాటు అతనిపై ఉన్న అవినీతి ఆరోపణలు దృష్టిలో ఉంచుకుని డీఈఈని సస్పెండ్ చేయాలని కలెక్టరు సిఫారసు చేశారు.



ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలు

ఇద్దరు మగ, ఒకరు ఆడపిల్ల జననం

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు31: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణంలో శారదానర్సింగ్ హోమ్‌లో శనివారం అరుదైన కాన్పు జరిగింది. రాజానగరం మండలం పాతతుంగపాడు గ్రామానికి చెందిన ఆలపాటి సంధ్యాకుమారి ఒకే కాన్పులో ముగ్గురు బిడ్డలకు జన్మనిచ్చింది. ఇద్దరు మగ పిల్లలు, ఒక ఆడపిల్ల పుట్టారు. శారదా నర్సింగ్ హోమ్ వైద్యులు డాక్టర్ గిరిబాల, డాక్టర్ శ్రావ్య బృందం ఆరోగ్యశ్రీ ద్వారా కుమారికి శస్త్ర చికిత్స చేసి కాన్పు జరిపారు. పిల్లలు ముగ్గురు పూర్తి ఆరోగ్యంతో ఉండవలసిన బరువుతో ఉన్నట్టు డాక్టర్ గిరిబాల తెలిపారు. డాక్టర్ గిరిబాల మాట్లాడుతూ ఆలపాటి వీరబాబు, సంధ్యాకుమారిలకు వివాహమై ఐదేళ్లు అయినా సంతానం కలగలేదని, శారద నర్సింగ్ హోమ్‌లో చికిత్స తీసుకున్నాక సంధ్యాకుమారి గర్భందాల్చిందని తెలిపారు.

వృద్ధురాలిపై అత్యాచారయత్నం చేసిన నిందితుడికి రిమాండ్

కరప, ఆగస్టు 31: వృద్ధురాలిపై అత్యాచారయత్నం చేసిన నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించగా మెజిస్ట్రేట్ అతడికి 14రోజుల రిమాండ్ విధించినట్టు కరప ఇన్‌చార్జ్ ఎస్ఐ కె.రామారావు తెలిపారు. కాకినాడ జిల్లా కరప మండలం వేళంగిలో 85 ఏళ్ల వృద్ధురాలిపై అదే గ్రామానికి చెందిన నొక్కు వెంకటరమణ గురువారం రాత్రి అత్యాచార యత్నానికి ఒడిగట్టిన విషయం తెలిసిందే. బాధితురాలు ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా నిందితుడిపై ఇంట్లోకి అక్రమ ప్రవేశం, దాడి, అత్యాచారయత్నం సెక్షన్ల కింద కేసు నమోదు చేశామన్నారు. విచారణలో భాగంగా వేళంగి గ్రామ శివారున నిందితుడిని అదుపులోకి తీసుకుని శనివారం కాకినాడ స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఫర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టులో హాజరుపరచామన్నారు. నిందితుడికి రిమాండ్ విధించగా కాకినాడ సబ్‌జైలుకు తరలించామని వివరించారు.

బహిర్భూమికి వెళ్లి డ్రైన్‌లో పడి వ్యక్తి మృతి

పి.గన్నవరం, ఆగస్టు 31: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం మొండెపులంక నుంచి మానేపల్లి శివారు శివాయిలంక వరకు మిగులు నీరు ప్రవహించే మినీ డ్రైన్‌లో శనివారం ప్రమాదవశాత్తూ ఒక వ్యక్తి జారిపడి మృతిచెందాడు. నాగుల్లంక శివారు శివాయిలంకకు చెందిన బొండాడ రామకృష్ణ (46) శనివారం ఉదయాన్నే స్థానికంగా ఉన్న తోటల్లో మినీ డ్రైన్ చెంతకు బహిర్భూమికి వెళ్లాడు. ఆ సమయంలో జారిపడగా కేకలు వేశాడు. స్థానికులు వచ్చి రక్షించే ప్రయత్నం చేసినా అప్పటికే రామకృష్ణ మునిగిపోయాడు. రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకుని స్థానికంగా ఉన్న ఈతగాళ్ల సాయంతో రామకృష్ణ మృతదేహాన్ని వెతికితీశారు. అనంతరం ఎస్ఐ బి.శివకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. రామకృష్ణకు భార్య శ్రీలక్ష్మి, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయి భార్య పిల్లలు, బంధువులు రోదిస్తుండడంతో శివాయిలంక గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.



నుజ్జయిన లారీ క్యాబిన్

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

పాచిపెంట, ఆగస్టు 31: పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలంలోని కంకణాపల్లి సమీపంలో గల ఘాట్ రోడ్డు జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో కాకినాడకు చెందిన లారీ డ్రైవర్ చెట్లపల్లి తాతారావు (58) మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. నవరంగపూర్ నుంచి కాకినాడకు దాణా లోడుతో వెళ్తుండగా కంకణాపల్లి వద్ద ముందున్న లారీని ఢీకొట్టింది. దీంతో క్యాబిన్ నుజ్జుకావడంతో డ్రైవర్ తాతారావు రెండు కాళ్లు విరిగిపోయి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ తాతారావు కుమారుడు విజయకుమార్ ఫిర్యాదు మేరకు హెచ్‌సీ సమర్పణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీవోనెం.22ను రద్దు చేయాలి

ఉప్పలగుప్తం, ఆగస్టు31: వైసీపీ ప్రభుత్వం 2020 సెప్టెంబరులో జారీ చేసిన జీవో నెం.22ను కూటమి ప్రభుత్వం రద్దు చేయాలని పీసీసీ అధికార ప్రతినిధి గెడ్డం సురేష్‌బాబు డిమాండ్ చేశారు. విలేకర్లతోశనివారం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లు బిగించాలన్న జీవోను అప్పట్లో టీడీపీ కూడా వ్యతిరేకించిందన్నారు. రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నామన్న కూటమి ప్రభుత్వం ఈవిషయంలో ఆలోచన చేయాలని చెప్పారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలని కోరారు.

ఎడతెరిపి లేకుండా వర్షం.. స్తంభించిన జనజీవనం



అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారంలో జలమయంగా మారిన రహదారి

ముమ్మిడివరం, ఆగస్టు 31: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజా జీవనం స్తంభించింది. పలు ప్రాంతాలు నీట మునిగాయి. మురుగునీటి కాల్వలు, పంట కాల్వలు పొంగి ప్రవహిస్తున్నాయి. పల్లపు ప్రాంతాల్లో వరి పనలు నీట మునుగుతున్నాయి. పలుచోట్ల రోడ్లపై నుంచి వర్షం నీరు పొంగి ప్రవహిస్తుంది. మండలంలో శనివారం 58.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తుఫాన్ కారణంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు.

మలికిపురం: రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. రోడ్లన్నీ గోతులుగా ఉండడంతో చెరువులుగా మారాయి.పలుప్రాంతాల్లో చెట్లు పడిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

అంతర్వేది: సఖినేటిపల్లి మండలంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పంట బోదెలు, మురికికాల్వలు పొంగి పొర్లాయి. పల్లపు ప్రాంతాలు నీటమునిగాయి. మండలంలో కాలనీలన్నీ జలమయమయ్యాయి. తుపాను ప్రమాదంతో అంతర్వేది పల్లిపాలెంలో మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని అధికారులు ఆదేశించారు. కుండపోత వర్షాలకు పాఠశాలలకు సెలవు ఇచ్చారు.

అంబాజీపేట: మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు రహదారులు జలమయంగా మారాయి. పనులు లేక కార్మికులు అవస్థలు పడ్డారు. పలు కాలనీల్లో వర్షం నీరు చేరడంతో ముంపు నీటిలో ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పలు వరి చేలల్లో ముంపు నీరు దిగక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కురిసిన వర్షాలకు రహదారులు చెరువులను తలపిస్తున్నాయి.

రాజోలు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో శనివారం కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పల్లపు ప్రాంతాలు, రోడ్లు, డ్రైనేజీలు నీటమునిగాయి. రాజోలులోని మండల రిసోర్స్‌సెంటర్, తహసీల్దార్ కార్యాలయం, పోలీసుస్టేషన్ సర్కిల్ కార్యాలయం, అగ్నిమాపక కేంద్రం, వ్యవసాయశాఖ కార్యాలయాల చుట్టూ వర్షం నీరు చేరింది. ట్రెజరీ కార్యాలయంలోకి వర్షం నీరు చేరడంతో సిబ్బంది పడుతున్న బాధలు వర్ణణాతీతం. ట్రెజరీ కార్యాలయంలోకి చేరిన వర్షం నీటిని సిబ్బంది బయటికి పంపిస్తున్నారు. ట్రెజరీ కార్యాలయం ఎదురుగాఉన్న గ్రౌండ్‌లో హౌసింగ్‌శాఖ సిబ్బంది ఇసుక గుట్టలు వేయడంతో వర్షం నీరంతా ట్రెజరీ కార్యాలయంలోకి వస్తుందని సిబ్బంది ఆవేదన చెందుతున్నారు ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

కపిలేశ్వరపురం: తుపాను ప్రభావంతో మండలంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. వర్షానికి ఇళ్లలోంచి బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాలకు నీరు చేరడంతో అవస్థలు పడ్డారు. విరామం లేకుండా కురుస్తున్న వర్షాలకు పంట పొలాల్లోకి నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షానికి రహదారులు జలమయం కావడం తో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు.

ఆలమూరు: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో జనజీవనం స్తంభించింది. ముఖ్యంగా రోడ్లు అతలాకుతలం అయ్యాయి. రోడ్లకు భారీ గోతులు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షాలకు చాలా చోట్ల సార్వా వరి పంట మునిగిపోయింది.

రావులపాలెం: మండలంలో రెండు రోజుల నుంచి కుండపోత వర్షం కురుస్తోంది. గ్రామాల్లో వర్షం తాకిడికి పలు రహదారులు ఛిద్రమయ్యాయి. రహదారుల్లోని గోతుల్లోకి వర్షపు నీరు చేరడంతో రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. పుంత రోడ్లు బురదమయంగా మారి రైతులు పొలాలకు వెళ్లేందుకు వీలులేక తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. ఎడతెరిపిలేని వర్షం కారణంగా రహదారులపై వాహనాల రాకపోకలు తగ్గడంతో రహదారులు నిర్మానుష్యంగా మారి వ్యాపార కూడలిలు వెలవెలబోయాయి.

అల్లవరం: నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు మండల పరిధిలోని పలు గ్రామాల్లో లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. ఓడలరేవు మన్నా కాలనీ, అల్లవరం, దేవగుప్తం, సామంతకుర్రు, గోడి, బోడసకుర్రు జగనన్న కాలనీలు ముంపు బారిన పడ్డాయి. ముంపు నీరు దిగే దారిలేక ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

కె.గంగవరం: మండలంలో శనివారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు జనజీవనం స్తంభించింది. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మురుగు డ్రైన్లు పొంగి ప్రవహించాయి.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తాం: వేగుళ్ల

కౌన్సిల్‌లో సూపర్‌సిక్స్ అమలుపై ఎమ్మెల్సీ తోట ప్రశ్న



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల, హాజరైన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట, ఆగస్టు 31: మండపేట మున్సిపాల్టీ సమావేశంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మధ్య ఆసక్తికర వ్యాఖ్యలు చోటు చేసుకున్నాయి. ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మూడు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు ఎంతమేరకు హామీలు నెరవేర్చారంటూ ఎమ్మెల్సీ తోట ప్రశ్నించారు. దీనికి వేగుళ్ల సమాధానమిస్తూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తుందని చెప్పారు. పట్టణంలో మెయిన్‌రోడ్డు గోతులతో అధ్వానంగా మారిందని కౌన్సిలర్లు, ఎమ్మెల్సీ తోట అన్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ ఎమ్మెల్సీ తోట సలహా తీసుకుని రహదారులను అభివృద్ధి చేస్తామన్నారు. వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలోకి చేరడంతో వైసీపీ బలం తగ్గడంతో ఎమ్మెల్యే వేగుళ్ల చేసిన తీర్మానాలే అమలవుతున్నాయి. ఇక చేసేదిలేక కౌన్సిల్ కూడా సై అంటుంది. మండపేటలో జనరిక్ మెడికల్ దుకాణం కూటమి ప్రభుత్వం రాగానే మారింది. పాత నిర్వాహకులను మార్చి నూతన సంఘానికి ఇవ్వటానికి గత నెలలో అజెండాలో తీసుకురాగా అందుకు ససేమిరా అన్న కౌన్సిల్ శనివారం జరిగిన సమావేశంలో ఆమోదించింది. మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం ఛైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి అధ్యక్షతన జరిగింది. అజెండాలోని పలు అంశాలకు కౌన్సిల్ ఆమోద ముద్రవేసింది. పట్టణంలో ఆక్రమణలపై హైదరాబాద్‌లో అమలుచేసిన హైడ్రా విధానం అమలు చేస్తే బాగుంటుందని ఎమ్మెల్సీ తోట ప్రస్తావించారు ఆక్రమణలు తొలగిస్తే మంచిదని పలువురు కౌన్సిలర్లు అభిప్రాయపడ్డారు. పట్టణంలో కుక్కల బెడద ఉందని నియంత్రణ కోసం చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు కోరారు. టిడ్కో ఇళ్లకు లబ్ధిదారులకు రుణం ఎప్పుడు రద్దుచేస్తారని ఎమ్మెల్సీ ప్రశ్నించారు. ఆ అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని వేగుళ్ల చెప్పారు. గతంలో సీఎం జగన్ టిడ్కోగృహాల రుణాలు రద్దు చేస్తామని చెప్పి మాట తప్పారని వేగుళ్ల ఆరోపించారు. బీసీలకు 50ఏళ్లకే పింఛన్ అంశాన్ని తోట ప్రస్తావించారు. ఈవిషయాన్ని శాసనమండలిలో తోట ప్రశ్నిస్తే బాగుంటుందని వేగుళ్ల సలహా ఇచ్చారు. మున్సిపల్ దుకాణాల అద్దెల విషయంలో జాప్యం జరుగుతుందని, బకాయిదారుల జాబితా కౌన్సిల్‌కు తీసుకురావాలని చెప్పినప్పటికీ రెవెన్యూ విభాగం పట్టించుకోకపోవడంపై ఆర్‌ఐపై వేగుళ్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అజెండాలో పలు అంశాలను చర్చించి కౌన్సిల్ ఆమోదించింది. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ బి.రాము. వివిధ శాఖల అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

- వర్షంలో సైతం పింఛన్లు పంపిణీ చేసిన ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ ఉద్యోగులు
- సుమారు 95శాతం పంపిణీ

ఒక రోజు ముందుగానే పింఛన్ల పండుగ







ఐ.పోలవరం: పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఉప్పలగుప్తం: పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, అంతర్వేది: పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంపీ హరీష్, ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

ముమ్మిడివరం, ఆగస్టు 31: వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తున్నా సచివాలయ ఉద్యోగులు, కూటమి నాయకులు శనివారం ఉదయం 5 గంటలకే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో 6,959మందికిగాను 6,524మందికి (93.74శాతం) పింఛన్లు పంపిణీ చేశారు. నగర పంచాయతీకి సంబంధించి 3,073మందికిగాను 2,901 మందికి (94.4 శాతం) పింఛన్లు అందించారు.

రాయవరం: జోరు వానలో మండలంలోని 12 గ్రామాల్లో పింఛన్ల పంపిణీ శనివారం వేగంగా సాగింది. మండలంలోని 10,196 మంది పింఛన్‌దారులు ఉండగా తెల్లవారుజాము నుంచి గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. సాయంత్రం వరకు మండలంలో 95.5శాతం పంపిణీ జరిగినట్లు ఎంపీడీవో నరేంద్రరెడ్డి తెలిపారు.

కె.గంగవరం: మండలంలో పింఛన్ల పంపిణీ శనివారం విజయవంతంగా పూర్తి చేశారు. ఎంపీడీవో ఎస్.శ్రీనివాస్ తెల్లవారుజాము నుంచే సిబ్బందిని అప్రమత్తంచేసి పింఛన్ల పంపిణీకి చర్యలు చేపట్టారు. ఆయన పర్యవేక్షణలో జోరు వానలో రెయిన్ కోట్లు ధరించి సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. గ్రామాల్లో స్థానిక టీడీపీ నాయకుల పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. అముజూరులో పార్టీ మండల అధ్యక్షుడు మరివాడ చిన్నికృష్ణ, సుందరపల్లిలో శిరెడ్డి సత్తిబాబు, సత్యవాడలో సలాది రమేష్, కుందూరులో జగతా రమణ, కోటిపల్లిలో వెంటూరి వీర్రాఘవులు చౌదరి, పామర్రులో మరివాడ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. మండలంలో 93శాతం పంపిణీ పూర్తయిందని, మిగిలినవి సోమవారం పంపిణీ చేస్తామని ఎంపీడీవో చెప్పారు.

మలికిపురం: శనివారం తెల్లవారుజాము నుంచి మండల పరిషత్, సచివాలయ సిబ్బంది పింఛన్లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. జోరున వర్షం కురుస్తున్నా లబ్ధిదారులకు పింఛన్లు అందజేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

అంతర్వేది: కూటమిప్రభుత్వం అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. సఖినేటిపల్లిలంకలో ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ శనివారం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఒక రోజు ముందే పింఛన్లు అందించడంతో పెన్షన్‌దారుల్లో ఆనందోత్సాహం చూశామన్నారు. కార్యక్రమంలో రేపూరి ఏసునరసింహరాజా, గుండుబోగుల పెదకాపు, గుబ్బల ఫణికుమార్, గెడ్డం మహిలక్ష్మిప్రసాద్, బందెల పద్మ, మంగెన భూదేవి, పడాల సోమశంకర్, కొండా కిశోర్, ముచ్చర్ల వెంకటేష్, కూటమి శ్రేణులు పాల్గొన్నారు. మండలంలోని గ్రామాల్లో వర్షాన్ని లెక్కచేయకుండా అధికారులు, సిబ్బంది పింఛన్లు పంపిణీ చేశారు.

అంబాజీపేట: జోరువానలో ఉద్యోగులు పింఛన్లు పంపిణీ చేశారు. శనివారం తెల్లవారుజాము నుంచి వర్షాన్ని లెక్కచేయకుండా ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో 9,288మంది 96శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో జీవీ సరోవర్ తెలిపారు. గ్రామాల్లోప్రజాప్రతినిధులు, కూటమి నేతలు, సచివాలయ ఉద్యోగులు పింఛన్లు అందించారు.



రావులపాలెం: పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

మామిడికుదురు: మండలంలో వర్షాన్ని లెక్కచేయకుండా సచివాలయ సిబ్బంది 94.48శాతం పింఛన్లు పంపిణీ చేశారని ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు తెలిపారు. 10,085మందికి శనివారం 9,525మందికి రూ.3,90,31,000 అందించారు. కూటమి నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.మిగిలిన పింఛన్లు సోమవారం పంపిణీ ఇస్తామన్నారు.

రాజోలు: పేదల సంక్షేమమే ధ్యేయంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎంపీపీ కేతా శ్రీను అన్నారు. తాటిపాకలో వర్షాన్ని లెక్కచేయకుండా శనివారం తెల్లవారుజామున పెన్షన్‌దారుల ఇళ్ల వద్దకు వెళ్లి ఆయన వారికి పెన్షన్లు అందజేశారు. మండలంలోని గ్రామాల్లో సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీవో ఎన్.బాలాజీ తెలిపారు. సాయంత్రం 4గంటలకు 95.49శాతం పంపిణీ చేశామన్నారు. సచివాలయ సిబ్బంది, ఎంపీడీవో బాలాజీ, ఈవోపీఆర్డీ జి.భీమారావు, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఇస్మాయిల్, వైస్ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అయినవిల్లి: ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఒకరోజు ముందుగానే మండలంలో పంపిణీ చేశారు. ఉదయం 5గంటల నుంచి గ్రామ పంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొని పెన్షన్లు పంపిణీ చేశారు.

ద్రాక్షారామ: నెలపర్తిపాడులో శనివారం మంత్రి వాసంశెట్టి సుభాష్ పింఛన్లు పంపిణీ చేశారు. వృద్ధులు, దివ్యాంగులకు మంత్రి స్వయంగా పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో వల్లూరి సురేష్‌బాబు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. నెలపర్తిపాడు శివారు ముచ్చెరువు గ్రామానికి చెందిన వాసంశెట్టి సత్యవేణి భర్త వాసంశెట్టి భాస్కరరావు ఇటీవల మరణించాడు. ఆ కుటుంబాన్ని మంత్రి పరామర్శించి మంత్రి రూ.25 వేలు అందజేశారు. శనివారం ఉదయం నుంచి వర్షం కురుస్తున్నా పింఛన్లు పంపిణీ జరిగింది. రామచంద్రపురం మండలంలో 95శాతం పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో 10,523 పింఛన్లకు 9,949, రామచంద్రపురం పట్టణంలో 4,504 పింఛన్లకు (96శాతం) 4,318 పంపిణీ చేశారు.

కపిలేశ్వరపురం: ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నప్పటికీ లెక్కచేయకుండా శనివారం తెల్లవారుజాము నుంచే సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పెన్షన్లు పంపిణీ ప్రారంభించారు. కపిలేశ్వరపురం, కాలేరు, వల్లూరు, కోరుమిల్లి తదితర గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు సాకా శ్రీనివాస్, దాయం కావేరి, దాసి మీనాకుమారి, ఆచంట సత్యనారాయణ, కూటమి నాయకులు పింఛన్లు పంపిణీ చేశారు.

ఐ.పోలవరం: ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు శనివారం కొమరగిరిలో ఇంటింటికి వెళ్లి సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వరసాల విజయచాముండేశ్వరి, గాదిరాజు బుచ్చికృష్ణంరాజు, సాకా సీతాదేవి, ఆకుల సత్తిబాబు, పెన్మెత్స శేఖర్, వరసాల ధనరాజు పాల్గొన్నారు.

కొత్తపేట: ఎడతెరిపి లేని వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా తెల్లవారుజాము నుంచి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అధికారులతో కలిసి పింఛన్ల పంపిణీ చేపట్టారు. వాడపాలెం, పలివెల గ్రామాల్లో పింఛన్లు పంపిణీ చేశారు.

ఉప్పలగుప్తం: సామాజిక పింఛన్ల పంపిణీలో సచివాలయ ఉద్యోగులకు వర్షం ఏమాత్రం అడ్డంకి కాలేదు. ఉదయం 5గంటల నుంచి వర్షంలోనే ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్ల వద్ద పింఛన్లు అందించారు. సాయంత్రానికి మండలంలో 7,942 పింఛన్లకు 95శాతం పంపిణీ జరిగినట్టు ఎంపీడీవో కొరారి వెంకటేశ్వరప్రసాద్ తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, మాజీ జడ్పీటీసీ దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

రావులపాలెం: ప్రజా అవసరాలు గుర్తించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మండలంలో శనివారం తెల్లవారుజాము నుంచే పెన్షన్ల పంపిణీ కార్యక్రమం సచివాలయ ఉద్యోగులు చేపట్టారు. 1వ తేదీ సెలవు కావడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందుగానే పెన్షన్ల పంపిణీ చేపట్టారు.

ఆత్రేయపురం: మండలంలో 94శాతం పెన్షన్ల పంపిణీ పూర్తయింది. మండలంలోని 17గ్రామాల్లో ఉదయం 5గంటల నుంచే సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బంది రెయిన్ కోర్టులు ధరించి, గొడుగులు చేతబట్టి పెన్షన్లు పంపిణీ చేశారు. లొల్లకు చెందిన చిక్కాల వెంకట్రావు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో సర్పంచ్ కాయల జగన్నాథం సచివాలయ సిబ్బందితో వెళ్లి పెన్షన్ అందించారు.

ఆలమూరు: మండలలో 11,062పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా 93శాతం పింఛన్లు లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులుపాల్గొన్నారు.

అల్లవరం: కోడూరుపాడులో ఎమ్మెల్యే ఆనందరావు పింఛన్లను పంపిణీ చేశారు.వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పెన్షన్లు పంపిణీ చేసిన ఎంపీడీవో టీఎస్ఎస్ కృష్ణమోహన్, సిబ్బందిని ఎమ్మెల్యే ఆనందరావు, డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ శివశంకరప్రసాద్ అభినందించారు. టీడీపీ మండల అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు, సర్పంచ్ నడింపల్లి సుబ్బరాజు, పంచాయతీ కార్యదర్శి చిక్కం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని 23 సచివాలయాల పరిధిలో 9,418మందికి పెన్షన్లు పంపిణీ చేయాల్సి ఉండగా శనివారం 8,950మందికి 95శాతం పెన్షన్లు పంపిణీ చేశామని, జిల్లాలో అల్లవరం మండలం మూడో స్థానంలో నిలిచిందని ఎంపీడీవో తెలిపారు.

ప్రజారోగ్య విషయంలో అప్రమత్తంగా ఉండాలి

కొత్తపేట, ఆగస్టు 31: సీజనల్ వ్యాధులు, వైరల్ జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచించారు. శనివారం సీజనల్ వ్యాధులపై వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీ, తాగునీటి సరఫరా, డ్రైనేజీశాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్సు నిర్వహించి ప్రజలకు వైద్యం, సురక్షిత తాగునీరు, సంపూర్ణ పారిశుధ్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య పరీక్షలు, మందులు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఆందోళన చెందకుండా వినియోగించుకోవాలన్నారు. అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుమలత పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన

యానాం, ఆగస్టు 31: యానాం శ్రీభూసమేత వెంకటేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణ పనులను శనివారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పరిశీలించారు. జరుగుతున్న పనులపై కాంట్రాక్టు ప్రతినిధులు, ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. మొదటి దశలో టీటీడీ, భక్తుల సహకారంతో రూ.6 కోట్లతో పనులు జరుగుతున్నాయి.

డ్వాక్రా యానిమేటర్ సస్పెన్షన్

అల్లవరం, ఆగస్టు 31: గూడాలలో రూ.4లక్షల మేర డ్వాక్రా సంఘాలకు చెందిన స్త్రీనిధి, ఉన్నతి నిధుల సొమ్ములో అవకతవకలకు సంబంధించి గూడాల యానిమేటర్ గోసంగి వెంకటరమణను విధుల నుంచి తొలగించారు. రూ.4లక్షల మేర డ్వాక్రా సంఘాల సొమ్ము అవకతవకలు జరిగాయని రూ.3.60లక్షలు కడతానని యానిమేటర్ వెంకటరమణ తప్పించుకుని తిరుగుతున్నందున ఆమెను సస్పెండ్ చేసినట్లు డీఆర్‌డీఏ ఏపీఎం ఎండీ సయ్యద్ తెలిపారు. గోసంగి వెంకటరమణకు మెమోతో పాటు నోటీసులిచ్చినా తీసుకోలేదని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సస్పెండ్ చేశామన్నారు. ఆమె స్థానంలో కొత్తయానిమేటర్‌గా గోసంగి ప్రీతిని నియమించామన్నారు.

సూర్యచంద్రరావు 12వ వర్ధంతి



సూర్యచంద్రరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ హరీష్‌మాధుర్

అమలాపురం టౌన్, ఆగస్టు 31: కాపు రిజర్వేషన్ పోరాటసమితి వ్యవస్థాపకుడు, కాపు ఉద్యమనేత నల్లా సూర్యచంద్రరావు 12వ వర్ధంతిని శనివారం అభిమానులు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో సూర్యచంద్రరావు విగ్రహానికి ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, మున్సిపల్ ఛైర్మన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, మాజీ ఛైర్మన్ నల్లా విష్ణుమూర్తి, టీడీపీ నాయకుడు మెట్ల రమణబాబు తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. సూర్యచంద్రరావు తనయులు నల్లా అజయ్, సంజయ్ ఆధ్వర్యంలో నల్లా గార్డెన్స్, మహిపాలవీధి, గండువీధిలోని ఆయన విగ్రహాలకు అభిమానులు పూలమాలలువేసి నివాళులర్పించారు. గడియార స్తంభంసెంటర్‌లో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్, నల్లా శ్రీదేవి, గంటా స్వరూప, కుడుపూడి భరత్‌భూషణ్, సుంకర సుధ, నల్లా పరమేశ్వరరావు, నల్లా సురేష్ కుమార్, డాక్టర్ కొమ్ముల ధన్వంతరీనాయుడు, వంటెద్దు బాబి, పెచ్చెట్టి విజయలక్ష్మి, దెందుకూరి సత్తిబాబురాజు, పెనుమాల చిట్టిబాబు, ఇసుకపట్ల రఘుబాబు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదుపై సమావేశం

అమలాపురంటౌన్, ఆగస్టు31: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల నమోదుపై శనివారం మండల రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ జీడీ కిశోర్‌బాబు సమావేశం నిర్వహించారు. ఫారం-19 దరఖాస్తులు తక్కువగా వస్తున్నాయని, ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘ నేతలకు సూచించారు. డీఈవో, డీవైఈవోలకు కౌంటర్ సైన్‌చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సరిదే సత్యపల్లంరాజు కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల నమోదు వివరాలు వివరించారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	మిస్టర్ బచ్చన్
శ్రీలలిత	కమిటీ కుర్రోళ్లు
శేఖర్ స్క్రీన్-1	మారుతీనగర్ సుబ్రహ్మణ్యం
శేఖర్ స్క్రీన్-2	డబుల్ ఇస్మార్ట్
రమా	ఆయ్
గణపతి	రేవు
వెంకటపద్మావతిస్క్రీన్-1	సరిపోదా శనివారం
వెంకటపద్మావతి స్క్రీన్-2	తంగలాన్

నిజాయితీగా పర్సు అప్పగింత

అమలాపురం రూరల్, ఆగస్టు 31: కాట్రేనికోన మండలం నడవపల్లి గ్రామానికి చెందిన గిడ్డి సత్యప్రసాద్‌విజయ్‌కుమార్, గెద్దా భూషణం శనివారం కామనగరువులో కర్రలు కొనుగోలు చేసేందుకు వచ్చి వెళుతుండగా మార్గమధ్యంలో వారికి పర్సు దొరికింది. ఆ పర్సులో రూ.10వేలు నగదుతో పాటు వివిధ బ్యాంకులకు సంబంధించిన ఏటీఎం కార్డులు, క్రెడిట్ కార్డులు, గల్ఫ్ దేశానికి సంబంధించిన ఐడీ కార్డులు ఉన్నాయి. ఆ పర్సులో ఉన్న సమాచారం ఆధారంగా అల్లవరం మండలం కోడురుపాడుకు చెందిన అయితాబత్తుల చినబాబుదిగా గుర్తించి సర్పంచ్ నక్కా అరుణకుమారి, శ్రీనురాజు సమక్షంలో పర్సును అప్పగించారు. విజయ్‌కుమార్, భూషణంను పలువురు అభినందించారు.

మంత్రి సుభాష్‌పై నిరాధార ఆరోపణలు తగవు

ద్రాక్షారామ, ఆగస్టు31: వెల్లసావరంజగనన్న ఇళ్లకాలనీకి సంబంధించి ఇసుక డిపిడీలో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌పై వైసీపీ నాయకులు ఆరోపణలు చేయడం తగదని బీజేపీ ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జ్ పలిలెల రాజు అన్నారు. వైసీపీ నాయకులు ఉనికిని కాపాడుకోవడం కోసం సుభాష్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. 2019నుంచి 2024వరకు పేదలఇళ్ల స్థలాల కోసం భూముల కొనుగోలు, మెరక పనుల్లో జరిగిన అవినీతి మాటేమిటన్నారు.

యానాం స్టోర్స్ అధ్యక్షుడిగా విద్యాసాగర్

యానాం, ఆగస్టు 31: యానాం కోపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్ ఎన్నికలకు సంబంధించి 9మంది డైరెక్టర్లలో 8మంది మల్లాడి వర్గానికి చెందినవారు ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. శనివారం మల్లాడి స్వగృహంలో జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా సహకార విశ్రాంతి అధికారి లంక విద్యాసాగర్, ఉపాధ్యక్షుడిగా ప్రముఖ న్యాయవాది కమిడి విజయ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా కోన సూర్యవతి, గెద్దం వేణు, ధూళిపూడి మాధవ వెంకన్న, మల్లాడి తాతాజీ, అంకాడి దేవి, పావులూరి మేరి గ్రేస్ ఉన్నారు. కమిటీ సభ్యులను మల్లాడి సత్కరించారు. అనంతరం వారు మల్లాడిని సత్కరించారు.

ఘనంగా ఆలయ పునఃప్రారంభం

అంతర్వేది, ఆగస్టు 31: సఖినేటిపల్లిలంకలో శనివారం వినాయకుని ఆలయాన్ని పునఃప్రారంభించారు. కార్యక్రమానికి ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ విచ్చేశారు. ప్రజలందరూ తరలిరావడంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. గ్రామస్తులు, సర్పంచ్ రాజేశ్వరి ఏసునరసింహరాజా దంపతుల పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు జరిగాయి. గుండుబోగుల పెద్దకాపు, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, గుబ్బల ఫణికుమార్, కొండా కిశోర్, పడాల సోమశంకర్, ముప్పర్తి నాని, ప్రసాద్, రాంజీ, ముచ్చర్ల వెంకటేష్, పాల్గొన్నారు.

బ్యారేజీ మరమ్మతులకు రూ.35లక్షలు

ఆత్రేయపురం, ఆగస్టు 31: ఉభయగోదావరి జిల్లాల వారధిగా ఉన్న కాటన్ బ్యారేజీ మరమ్మతులకు గత పాలకులు చొరవ చూపకపోవడంతో అధ్వాన స్థితిలో ఉంది. ధవళేశ్వరం వైపు నుంచి బ్యారేజీకి వెళ్లే కొంత మేర, విజ్జేశ్వరం బ్యారేజీ మరమ్మతులకు అప్పటి తూర్పు కలెక్టర్ రూ.2కోట్లు మంజూరు చేశారు. కోనసీమ పరిధిలోని బ్యారేజీ మధ్య భాగం ర్యాలి ఆర్మ్ కిలోమీటరు మేర నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో పిచ్చుకలంకకు వచ్చిన కలెక్టర్ మహేష్‌కుమార్‌కు బ్యారేజీ స్థితిగతులను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందించి బ్యారేజీ మరమ్మతులకు రూ.35 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు త్వరలో టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి పనులు చేపడతామని ఎమ్మెల్యే బండారు తెలిపారు.

రూ.25వేలు వేతనంపై హర్షం

మామిడికుదురు, ఆగస్టు 31: దేవాలయాల్లోని కేశఖండనశాలలో పనిచేస్తోన్న నాయీ బ్రాహ్మణులకు కనీస వేతనం రూ.25వేలు ప్రకటించడంపై అప్పనపల్లి శ్రీబాలబాలాజీ స్వామి దేవస్థానం కల్యాణకట్ట నాయీ బ్రాహ్మణ సేవా సంఘ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. అప్పనపల్లిలో సీఎం చంద్రబాబు, డిప్యూటీసీఎం పవన్ కల్యాణ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సేవాసంఘ జిల్లా అధ్యక్షుడు ర్యాలి లోవరాజు, మానుకొండ ప్రసాద్, పట్టాభిరామయ్య, టీడీపీ నాయకులు తులా శ్రీనివాస్, బొంతు సూర్యభాస్కరరావు, కామిశెట్టి వీరన్న, బీజేపీ నాయకుడు కంకిపాటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

లేవలేనిస్థితిలోని దివ్యాంగులకు రూ.15వేలు పింఛన్ ఇవ్వండి



పి.గన్నవరంలో దివ్యాంగుడిని పలకరిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం, ఆగస్టు31: మంచం పైనుంచి లేవలేని పరిస్థితిలో ఉన్న దివ్యాంగులను గుర్తించి వారికి రూ.15వేల పింఛన్ వచ్చేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. పి.గన్నవరంలో అర్హులైన వారికి రూ.15 వేల వికలాంగ పింఛన్ రాకపోవడంతో వారితో ఆయన మాట్లాడారు. మండలవ్యాప్తంగా వివరాలు సేకరించి వారికి పూర్తిస్థాయి వికలాంగ పింఛన్ అందించాలని తహశీల్దార్ పి.శ్రీపల్లవి, ఎంపీడీవో ఎం.భారతీలను ఆయన ఆదేశించారు. దివ్యాంగులైన చుట్టుగుళ్లవారిపేటలో 29ఏళ్ల అబ్బులును, సుంకరవారివీధిలో కుంపట్ల వీరవెంకటసతీష్‌లను పరామర్శించి రూ.15వేల పింఛన్ వచ్చే విధంగా చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వాసంశెట్టి కుమార్, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

చారిత్రాత్మక కట్టడాలను మూసివేస్తే ఎలా

ప్రధాన పంటకాల్వ చెంతనే ఉన్న బ్రిటీష కాలం నాటి కట్టడాలను మూసివేసి రేకు షెడ్డులను నిర్మిస్తే ఎలా అని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అసహనం వ్యక్తంచేశారు. పంటకాల్వ చెంతనే ఏర్పాటుచేసిన బిర్యానీ పాయింట్‌లో మూసివేసి ఉంచిన పి.గన్నవరం వార్ఫ్అని రాసి ఉన్న పాత కాలం నాటి బోర్డును పరిశీలించి అనంతరం మాట్లాడారు. బ్రిటీషు కాలం, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా కాల్వల్లో పడవలు రాకపోకలు సాగించేవని, ఆ సమయంలో నిర్మించిన కట్టడాలే కదా ఇవీ అని ప్రశ్నించారు.

ఉద్యోగ విరమణ

అమలాపురం టౌన్, ఆగస్టు 31: అమలాపురం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వక్కలంక శ్రీనివాసరావు శనివారం ఉద్యోగ విరమణ చేశారు. జూనియర్ అసిస్టెంట్‌గా విశిష్ట సేవలు అందించిన శ్రీనివాసరావును సీనియర్ సివిల్ జడ్జి ఎ.సాయికుమారి, కోర్టు సిబ్బంది సత్కరించారు. పలువురు వక్తలు ఆయన సేవలను కొనియాడారు.

పరిహారం పంపిణీ

కాట్రేనికోన, ఆగస్టు 31: బ్రహ్మసమేధ్యానికి చెందిన కాలాడి సత్తిబాబు గత ఏడాది సముద్రంలో చేపల వేటకు వెళ్లి బోటు తిరగబడి మృతిచెందాడు. మత్స్యకార భరోసా పథకం ద్వారా మంజూరైన రూ.5లక్షల పరిహారాన్ని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు సత్తిబాబు భార్య దుర్గమ్మకు అందించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నాగిడి నాగేశ్వరరావు, ఎఫ్‌డీవో సీహెచ్.గోపాలకృష్ణ, మత్స్యశాఖ సహాయకులు బాలయోగి, లోవరాజు ఉన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

ముమ్మిడివరం, ఆగస్టు 31: గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యంపై తక్షణం చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.ఉదయభాస్కరవర్మ డిమాండు చేశారు. కళాశాల వసతిగృహంలోని వాష్ రూమ్‌లో కెమెరాలు అమర్చడం హేయమైన చర్య అన్నారు. ప్రభుత్వం ఇటువంటి కళాశాలలకు లైసెన్సులు రద్దు చేయాలన్నారు.

ద్రాక్షారామ: కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల బాలికల హాస్టల్ వాష్‌రూమ్స్‌లో సీసీ కెమెరాలు అమర్చిన వారిని శిక్షించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ డిమాండ్ చేశారు. కెమెరాల విషయం గుర్తించి విద్యార్థులు కళాశాల యాజమాన్యానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

అరటి పంటను ధ్వంసం చేసిన పందులు

అంబాజీపేట, ఆగస్టు31: మాచవరంలో కొలిశెట్టి భానుప్రసాద్‌కు చెందిన అరటి తోటను పందులు ధ్వంసం చేశాయి. 4ఎకరాల అరటితోటలో పందులు స్వైరవిహారం చేసి పంటను పూర్తిగా నాశనం చేశాయని, దీంతో లక్షలాది రూపాయలు నష్టపోయినట్లు అతడు వాపోయాడు. పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పందులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

గరుత్మంతుని విగ్రహావిష్కరణ

మామిడికుదురు, ఆగస్టు 31: అప్పనపల్లి వైనతేయ నదీ తీరంలో స్నానాల రేవు వద్ద గరుత్మంతుని విగ్రహాన్ని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ శనివారం ఆవిష్కరించారు. మురమళ్లకు చెందిన చీకట్ల చిన్నయ్య -ఆదిలక్ష్మి దంపతులు, కుటుంబసభ్యులు సమకూర్చిన విగ్రహం చూడముచ్చటగా ఉంది. విగ్రహ దాత, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుపై దృష్టి పెట్టండి

కొత్తపేట, ఆగస్టు 31: ఈనెల2వ తేదీ నుంచి చేపట్టే బీజేపీ సభ్యత్వ నమోదుపై దృష్టి పెట్టాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కోనసీమ జిల్లా సభ్యత్వ ప్రముఖ్ పాలూరి సత్యానందం చెప్పారు. రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పిలుపు మేరకు 2న పదివేల గ్రామాల్లో సభ్యత్వ నమోదు జరుగుతుందని, ప్రతిఒక్కరూ 25 సభ్యత్వాలకు తక్కువ కాకుండా నమోదు చేయించాలన్నారు.

మండపేట కమిషనర్‌గా రంగారావు

మండపేట, ఆగస్టు31: మండపేట మున్సిపల్ కమిషనర్ రాము విశాఖకు బదిలీ అయ్యారు. మండపేట కమిషనర్‌గా ప్రకాశం జిల్లా కనిగిరి మున్సిపల్ కమిషనర్ టి.విరంగారావు నియమితులయ్యారు. రామును శనివారం కౌన్సిల్‌లో సభ్యులు ఛైర్‌పర్సన్ రాణి, కౌన్సిలర్లు సత్కరించి వీడ్కోలు పలికారు.

గంగిరెద్దుల కులస్తుల సంక్షేమానికి కృషి చేస్తా: సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 31: గంగిరెద్దుల కలస్థుల సంక్షేమానికి కృషి చేస్తానని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శనివారం రామచంద్రపురంలోని శెట్టిబలిజ కల్యాణ మండపంలో జరిగిన భారత దేవ విముక్తి సంచారజాతుల 72వ సాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గంగిరెద్దుల కులస్థులు తన విజయంలో కీలకపాత్ర పోషించారన్నారు. కమ్యూనిటీ హాలు స్థలం నెల రోజుల్లోపే ఏర్పాటు చేస్తానన్నారు. సంచార జాతుల సంక్షేమం కూటమి ప్రభుత్వంలో జరుగుతుందన్నారు. మీపిల్లలను చదివిస్తే ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. ఆరోగ్యశ్రీ జాబితాలో లేని అనారోగ్య సమస్యలు ఏమైనా వస్తే తాను వైద్యం చేయిస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ టేకుమూడి సత్యనారాయణ, కంచుమర్తి బాబూరావు, మాజీ సర్పంచ్ వనుంరాజు, అధిక సంఖ్యలో గంగిరెద్దుల సామాజిక వర్గీయులు పాల్గొన్నారు.

ఇంద్రాణి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం

అమలాపురం టౌన్, ఆగస్టు 31: జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదిన మహోత్సవాలను పురస్కరించుకుని నల్లా ఇంద్రాణి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం స్థానిక ముస్లిం షాదీఖానా భవనం వద్ద మెగా వైద్య శిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరం జీఎస్ఎల్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్య సిబ్బందితో ప్రత్యేక వాహనాల ద్వారా ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని అమలాపురం, పి.గన్నవరం ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, గిడ్డి సత్యనారాయణ ప్రారంభించారు. డాక్టర్ మూర్తి పలు విభాగాలను ప్రారంభించారు. ఎంపీ గంటి హరీష్‌మాధుర్ హాజరై ఇంద్రాణి ట్రస్టు ఆధ్వర్యంలో ఏటా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న జనసేన సీనియర్ నేత నల్లా శ్రీధర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. రోగులకు 18విభాగాల ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.